రాష్ట్ర మార్కెట్లోకి ఎఎం/ఎన్ఎస్ తుప్పు నిరోధక ఉత్పత్తులు

హైదరాబాద్ : ఆర్సెలర్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ఇండియా (ఎఎం/ఎన్ఎస్) తెలంగాణలో తమ ఆప్టిగల్ శ్రేణి కలర్ కోటెడ్ స్టీల్ ఉత్పత్తులను అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపింది. ఇక్కడ ఆప్టిగల్ ప్రైమ్ (15 సంవత్సరాల వారంటీ) ఆప్టిగల్ పినాకిల్ (25 సంవత్సరాల వారంటీ) ఉత్పత్తులు లభిస్తాయని పేర్కొంది. ఈ ప్రామాణిక తుప్పు నిరోధక ఉక్కు ఉత్పత్తులు తెలంగాణలోని వేగవంతమైన మౌలిక సదుపాయాల అవసరాలకు అనుగుణంగా ఉంటాయని పేర్కొంది. పేటెంట్ సాంకేతికతతో రూపొందిన ఈ ఉత్పత్తులు, పట్టణ, తీరప్రాంత,, పారిశ్రామిక వాతావరణాల్లో దీర్ఘకాల మన్నికను అందిస్తాయని ఆ సంస్థ డైరెక్టర్ రంజన్ ధర్ తెలిపారు.

యూరియాతో వరి పండించడం మంచిది కాదు

- బిల్డర్స్ మేలు కోసం హైడ్రా : ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎక్కువస్థాయిలో యూరియా ఉపయోగించి వరిని పండించడం మంచిది కాదని బిజెపి ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో ఏటా 45 లక్షల టన్నుల వరి తింటున్నారనీ, రెండు లక్షల టన్నులు ఉత్పత్తి అవుతుందనితెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కేంద్రం యూరియాకు సబ్సిడీ ఇస్తోందన్నారు. ధాన్యాన్ని మద్దతు ధర ఇచ్చి కేంద్రం కొనుగోలు చేస్తున్నదని చెప్పారు. యూరియా కోటాను ఇంకా పెంచాలని సీఎం రేవంత్‌రెడ్డి అడగటం సరిగాదన్నారు. వరి సాగును తగ్గించి తృణధాన్యాల సాగును పెంచేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలో కాళేశ్వరం ప్రాజెక్టు ఉపయోగంలో లేకుండా ఈ ఏడాది వరి దిగుబడి బాగానే వచ్చిందని తెలిపారు. దేశంలోని నాలుగు కోట్ల మంది బంగ్లాదేశీయులు అక్రమంగా చొరబడ్డారనీ, తెలంగాణలోనే 20 లక్షల మంది ఉన్నారని ఆరోపించారు. గతంలో తాను హైడ్రాను మెచ్చుకున్నానన్నారు. అయితే, బిల్డర్స్ కోసమేదాన్ని తెచ్చినట్టుందని ఇప్పుడు అర్ధమవుతున్నదని విమర్శించారు. ఓవైసీ ఫాతిమా కళాశాలను కూల్చే దమ్ము హైడ్రాకు ఎందుకు లేదని ప్రశ్నించారు. ఎంఐఎంనేతలకుకాంగ్రెస్ లొంగిపోయిందని ఆరోపించారు. పార్టీలో ఉంటూ వ్యతిరేకంగా మాట్లాడేవారిని ఉపేక్షించబోమని హెచ్చరించారు. కొంత మంది మంచి తనంతో పార్టీకి నష్టం జరుగుతున్నదన్నారు. క్షేత్రస్థాయి నుంచి బిజెపిని బలోపేతం చేయాల్సిన అవసరముందని నొక్కి చెప్పారు.

బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు

- త్వరలో ఆర్డినెన్స్
- 17వేల నియామకాల కోసం జాబ్ కేలండర్
- మంత్రిమండలి నిర్ణయాలు వెల్లడించిన పొంగులేటి

మంత్రి మండలిలో చర్చించిన అంశాలను మీడియాకు వివరిస్తున్న మంత్రి పొంగులేటి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో 42 శాతం బిసి రిజర్వేషన్ల అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం త్వరలో ఆర్డినెన్స్ తీసుకురానున్నారు. గురువారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో సమావేశమైన కేబినెట్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. మంత్రివర్గ సమావేశానంతరం రెవెన్యూ, గృహనిర్మాణం సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు ఆర్డినెన్స్ ఇచ్చేందుకు క్యాబినెట్ ఆమోదం తెలిపిందని చెప్పారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేశాకే స్థానిక ఎన్నికలకు వెళ్తామన్నారు. రిజర్వేషన్ల అమలుకు 2018లో తెచ్చిన చట్టాన్ని సవరించాలని నిర్ణయించినట్లు తెలిపారు. 'ప్రజా ప్రభుత్వంలో 19 క్యాబినెట్ భేటీలు నిర్వహించాం. ఇప్పటి వరకు జరిగిన భేటీల్లో 321 అంశాలను మంత్రివర్గం ఆమోదించింది. గత మంత్రివర్గ సమావేశాల్లో ఆమోదించిన అంశాల అమలుపై సమీక్ష నిర్వహించాం. ప్రతిష్టాత్మక అమిటీ, సెంటినరీ రిహాబిలిటేషన్ విద్యాసంస్థలకు యూనివర్సిటీ హోదా ఇచ్చేందుకు ఆమోదం తెలిపాం. ఈ వర్సిటీల్లో రాష్ట్ర విద్యార్థులకు 50 శాతం సీట్లు కేటాయిస్తాం. దేశానికే ఆదర్శంగా రాష్ట్రంలో కులగణనను విజయవంతంగా పూర్తిచేశాం" అని పొంగులేటి తెలిపారు. అనంతరం పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. 17వేలకు పైగా ఉద్యోగాలు ఇచ్చేందుకు జాబ్ క్యాలెండర్ సిద్ధంగా ఉందన్నారు. మార్చిలోపు లక్ష ఉద్యోగాలు ఇచ్చేందుకు మంత్రివర్గంలో నిర్ణయించామని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై అధికారుల కమిటీ నియమించి పరిష్కరిస్తామన్నారు. హైకోర్టు తీర్పు మేరకు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.కుల గణన నివేదిక ప్రకారమే బిసి రిజర్వేషన్లు పెంచాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. మేడిగడ్డ బ్యారేజీలో మరమ్మతులపై ఎన్‌డీఎస్‌ఎ, విజిలెన్స్ ఇచ్చిన నివేదికలపై మంత్రివర్గం చర్చించింది. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ సవరణ చట్టం, రేషన్ కార్డుల జారీ, స్థానిక సంస్థల ఎన్నికలు, గోశాలల నిర్మాణం, మహిళా సంక్షేమ కార్యక్రమాల అమలుపై మంత్రిమండలి చర్చించినట్టు తెలిసింది.

పెరుగుతున్న గోదావరి.. హెచ్చరికలు జారీ..

- ప్రమాదస్థాయికి చేరిన కాళేశ్వరం పుష్కర ఘాట్
- సమ్మక్క సారక్క బ్యారేజ్ వద్ద జలకళ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జయశంకర్-భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద గోదావరి పెరుగుతోంది. 10.520 మీటర్ల ఎత్తులో నీరు ప్రవహిస్తోంది. దాంతో పుష్కర ఘాట్ వద్ద ప్రమాద స్థాయికి నీరు చేరుకుంది. మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజ్ వద్ద వరద ఉధృతి 6,36,130 ఇన్‌ఫ్లో కాగా, 85 గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల చేస్తున్నట్టు ఇంజినీర్లు తెలిపారు. కాళేశ్వరం వద్ద 10.690 అడుగులు చేరుకున్నట్టు సిడబ్ల్యుసి అధికారులు తెలిపారు. మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలతో పాటు ఎగువన గేట్లు ఎత్తివేయడంతో కాళేశ్వరం వద్ద అంతకంతకు నీరు చేరుకుంటోంది. ఈ క్రమంలో లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉడాలని పోలీసులు, రెవెన్యూ అధికారులు, నీటిపారుదల అధికారులు హెచ్చరించారు.ములుగు జిల్లా ఏటూర్‌నాగారం మండలంలోని రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద గురువారం సాయంత్రం నాటికి నీటి మట్టం 13 మీటర్లకు చేరింది. అయితే వరద క్రమంగా పెరిగే అవకాశాలు ఉన్నదని కేంద్ర జల వనరుల అధికారులు అంచనా వేస్తున్నారు. వరద ప్రవాహాన్ని గంటగంటకు పరిశీలిస్తూ ఎప్పటికప్పుడు అధికారులకు సమాచారాన్ని చేరవేస్తున్నారు. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో భారీ వర్షాలు ఉన్నందున వరద గోదావరిలో కలిసే ప్రమాదం ఉందని లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. పుష్కర్ ఘాట్ వద్ద వరద ప్రవాహం 14.82 మీటర్లకు చేరితే అధికారులు మొదటి హెచ్చరిక జారీ చేస్తారు. 15.82 మీటర్లకు చేరితే రెండవ ప్రమాద హెచ్చరికను, 17.32 మీటర్లకు చేరితే మూడో ప్రమాద హెచ్చరికను అధికారులు జారీ చేస్తారు. ఇటీవల జిల్లా కలెక్టర్ దివాకర, రెవెన్యూ ఇరిగేషన్ అధికారులతో కలిసి గోదావరి పరివాహక ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అలాగే కన్నాయిగూడెం మండలం గుట్టలగంగారం గ్రామంలోని సమ్మక్క సారక్క (చొక్కా రావు ఎత్తిపోతల పథకం) బ్యారేజ్ దేవాదుల పంప్ హౌస్ వద్ద నీటి నిల్వ భారీగా చేరుకుని జలకళ సంతరించుకుంది. కొన్ని రోజులుగా మోటార్ల ద్వారా భీమ్ ఘణపూర్ రిజర్వాయర్‌లోకి 1078 క్యూసెక్కుల నీరు పంపింగ్ జరుగుతుందని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. గోదావరిలో నీటి ప్రవాహం క్రమంగా పెరుగుతుండటంతో దేవాదుల ఇన్టేక్ వెల్ వద్ద ఎత్తిపోతలను ఎగువ ప్రాంతాల్లోకి నీటి సరఫరా జరుగుతుందని అధికారులు అన్నారు. దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టు వద్ద 83.00 మీటర్ల నీటి మట్టానికి 80.30 మీటర్లు ఉంది. 6.94 టిఎంసిల నీటి నిల్వకు 4.429 టిఎంసిలు ఉంది. తుపాకులగూడెం వద్ద సమ్మక్క సాగర్ బ్యారేజీలో 83 మీ. నీటి మట్టానికి 80.30 మీ. ఉండగా 6.94 టిఎంసిలకు గాను 4.429 టిఎంసిలు ఉందని ఇరిగేషన్ డిఇ శరత్ బాబు, ఎఇఇ సాయిరాం తెలిపారు. సమ్మక్క సాగర్ బ్యారేజీ వద్ద మొత్తం 59 గేట్లకు 59 ఎత్తి 5,10,047 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.



సిఎంఎ ఫౌండేషన్ పరీక్షలో గురుకుల విద్యార్థుల సత్తా

- టిజిఎస్‌డబ్ల్యుఆర్ఇఐఎస్ కార్యదర్శి అలగు వర్షిణి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిఎంఎ ఫౌండేషన్ (కాస్ట్ అండ్ మేనేజ్మెంట్ అకౌంటెంట్) పరీక్షలో సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థులు తమ సత్తా చాటారని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ (టిజిఎస్‌డబ్ల్యుఆర్ఇఐఎస్) కార్యదర్శి డాక్టర్ అలగు వర్షిణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ మీడియట్‌లో ఎంఇసి , సిఇసి కోర్సు చదువుతూనే సిఎంఎ పరీక్షలో విశేష ప్రతిభ కనబరిచారని పేర్కొన్నారు. ఆ పరీక్షను ప్రతి ఏటా నవంబర్ , జూన్‌లో నిర్వహిస్తారని గుర్తు చేశారు. ఈ ఏడాది జూన్‌లో నిర్వహించిన ఈ పరీక్షలో సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థకు చెందిన విద్యార్థులు మొత్తం 74 మంది విద్యార్థులు పరీక్ష రాశారని తెలిపారు. అందులో 39 మంది సిఎంఎ ఫౌండేషన్‌కు అర్హత సాధించారని పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం బ్రాంచ్‌లో 23 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 14 మంది , మేడ్చల్ బ్రాంచ్‌లో 23 మందికి 7 మంది, గౌలిదొడ్డి బ్రాంచ్‌లో 28 మందికి 18 మంది అర్హత సాధించారని తెలిపారు. సిఎంఎ ఫౌండేషన్ పరీక్షలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అభినందించారు.

కల్తీ కల్లు మృతుల కుటుంబాలకు రూ.20 లక్షలు ఇవ్వాలి : కెటిఆర్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కూకట్‌పల్లి పరిధిలో కల్తీ కల్లు తాగి మరణించిన వారి కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 20 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ఘటన బాధాకరమన్న ఆయన...మరణించిన వారికి సంతాపం, వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆస్పత్రిలో ఉన్న బాధితులకు మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

చైనాకు 'డెక్కన్' రైస్ ఎగుమతులు

- యుఎస్‌లో ఇప్పటికే విక్రయం
- డెక్కన్ గ్రెయింజ్ డైరెక్టర్ కిరణ్ కుమార్ పోలా వెల్లడి

హైదరాబాద్ : డెక్కన్ బ్రాండ్ పేరుతో రైస్ ఎగుమతుల్లో ఉన్న డెక్కన్ గ్రెయింజ్ ఇండియా తాజాగా చైనాలోకి అడుగుపెట్టినట్లు ప్రకటించింది. ఇప్పటికే స్వీడన్, బ్రిటన్, జర్మనీ, ఐర్లాండ్, లండన్, అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, ఈయూ, టర్కీలో 30 రకాల భారతీయ రైస్‌ను పరిచయం చేసినట్లు పేర్కొంది. ఈ స్థాయిలో విదేశీ గడ్డపై విస్తరించిన ఏకైక దక్షిణ భారత బ్రాండ్‌గా స్థానం సంపాదించామని డెక్కన్ గ్రెయింజ్ ఇండియా డైరెక్టర్ కిరణ్ కుమార్ పోలా తెలిపారు. బియ్యం ఉత్పత్తిలో భారత్ తర్వాత ప్రపంచంలో రెండవ స్థానంలో నిలిచిన చైనాలో కంపెనీ ప్రవేశించడం కీలక మైలురాయిగా అభివర్ణించారు. యూఎస్ మార్కెట్లో నాన్ బాస్మతి రైస్ విభాగంలో డెక్కన్ ఫుడ్స్ నంబర్ వన్ స్థానం కైవసం చేసుకున్నట్టు చెప్పారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణతోపాటు వివిధ రాష్ట్రాల్లోని వేలాది మంది రైతుల నుంచి నాణ్యమైన బియ్యం కొనుగోలు చేసి వివిధ దేశాలకు ఎగుమతి చేస్తున్నట్టు వివరించారు. దశాబ్దంన్నర ప్రయాణంలో కంపెనీ 7 కోట్లకుపైగా బ్యాగ్స్‌ను విదేశాల్లో విక్రయించామన్నారు. 2026 ప్రారంభంలో డెక్కన్ గ్రెయింజ్ భారత్‌లోనూ విక్రయాలను ప్రారంభించనుందని కిరణ్ కుమార్ తెలిపారు.

హెచ్‌సియు భూములొద్దు

- పునరాలోచనలో ప్రభుత్వం
- డీమ్డ్ ఫారెస్ట్‌గా కంచ గచ్చిబౌలి ప్రాంతం
- నిపుణుల కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కంచగచ్చిబౌలి భూముల విషయంలో ప్రభుత్వం పునరాలోచనలో పడింది. రాజకీయంగా, న్యాయపరంగా ఈ విషయంలో ప్రభుత్వానికి చెడ్డపేరు రావడంతో దీనిపై వెనకడుగు వేయడమే మంచిదనే అభిప్రాయాన్ని రాష్ట్ర మంత్రివర్గం గతంలోనే వ్యక్తం చేసింది. కాంగ్రెస్ అధిష్టానం కూడా ఈ వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వానికి దిశానిర్దేశం చేయడంతో, భవిష్యత్‌లో హెచ్‌సీయూ భూముల విషయంలో ఆచితూచి వ్యవహరించాలని నిర్ణయించారు. సుప్రీంకోర్టు కూడా ఈ విషయంలో ప్రభుత్వాన్ని తప్పుపట్టిన విషయం తెలిసిందే. సుప్రీం పర్యవేక్షణలోనే ప్రత్యేక నిపుణుల కమిటీని కూడా నియమించారు. ఈ కమిటీ విచారణ చేసి, నివేదిక ఇచ్చారు. దీనిపైనే సుప్రీం రాష్ట్ర ప్రభుత్వంపై సీరియస్ అయ్యింది. ఈ దశలో కంచ గచ్చిబౌలి భూముల్ని డీమ్డ్ ఫారెస్ట్‌గా ప్రకటించాలనే ప్రతిపాదన తెరపైకి వచ్చింది. ఈ మేరకు గతంలో అటవీ భూములు గుర్తింపు కోసం సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం రాష్ట్రంలో తాజాగా నిపుణుల కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

ఇదీ వివాదం

కంచ గచ్చిబౌలి సర్వేనెంబర్ 25లోని 400 ఎకరాల భూముల్ని రాష్ట్ర ప్రభుత్వం గతేడాది జూన్‌లో జీవో నెంబర్ 54 ద్వారా తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టిజిఐఐసి)కి అప్పగించింది. ఆ సంస్థ ఓ మధ్యవర్తి కంపెనీ ద్వారా భూములను తనఖా పెట్టి బాండ్ల ద్వారా రూ.10 వేల కోట్ల మొత్తాన్ని సేకరించింది. సంబంధిత స్థలంలో ఐటీ, ఇతర పరిశ్రమల కోసం భూమిని అమ్మడం లేదా కేటాయింపులు చేయాలని టిజిఐఐసి నిర్ణయించింది. దానికోసం భూమిని చదును చేసేందుకు అక్కడున్న చెట్లను తొలగించింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం అటవీ, వాల్టా చట్టాలను ఉల్లంఘించిందనీ, ఆ భూములు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సియు)కి చెందినవనే వివాదం చెలరేగింది. దీనితో ఈ భూములపై తెలంగాణ హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో కేసులు పడ్డాయి. సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని తీవ్రంగా ఆక్షేపించింది. ఈ అంశంపై ప్రత్యేక విచారణ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ కంచగచ్చిబౌలి ప్రాంతంలో పర్యటించి విచారణ జరిపింది.

కమిటీ ఏర్పాటు

పర్యావరణం, అటవీభూముల గుర్తింపునకు సంబంధించి గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన గైడ్‌లైన్స్ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. రాష్ట్ర అటవీ సంరక్షణ ప్రధానాధికారి (సిసిసిఎఫ్) డాక్టర్ సువర్ణ చైర్ పర్సన్‌గా ఆరుగురు సభ్యులను కమిటీలో నియమించారు. వైల్డ్ లైఫ్ నిపుణులు, రిటైర్డ్ డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ శంకరన్, నేషనల్ రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీ (ఎన్ఆర్ఎస్ఎ) చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ (సిసిఎల్ఎ) ప్రతినిధి, డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ మాధవరావు, ఖమ్మం జిల్లా అటవీ అధికారి, రాజన్న జిల్లా అటవీ సర్కిల్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ అధికారుల్ని కమిటీలో నియమించారు.

'డీమ్డ్ ఫారెస్ట్' అంటే...

'డీమ్డ్ ఫారెస్ట్' అంటే అటవీ ప్రాంతంగా కనిపించే భౌతిక ప్రాంతాలు. కానీ అవి అధికారికంగా అటవీ భూముల రికార్డుల్లో నమోదై ఉండవు. 1996లో టి.ఎన్.గొదవర్మన్ తిరుముల్పాడ్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం చట్టపరమైన హోదా ఆధారంగా కాకుండా, పర్యావరణ పరంగా అడవులను పోలి ఉండే భూములను డీమ్డ్ ఫారెస్ట్ అంటారు. ఇందు కోసం దేశంలోని అన్ని రాష్ట్రాల్లో నిపుణుల కమిటీలను ఏర్పాటు చేసి, వాటిని గుర్తించి, సంరక్షించాలని సుప్రీం ఆదేశించింది. చెట్ల సాంద్రత, వృక్ష, జంతు జాతులు, అరుదైన జీవవైవిధ్యం తదితర అంశాల ఆధారంగా వాటిని డీమ్డ్ ఫారెస్ట్‌లుగా ప్రకటించాలని సూచించింది.

19న సిఐటియు రాష్ట్ర 5వ మహాసభ

- హాజరు కానున్న జాతీయ కోశాధికారి ఎం సాయిబాబు
- ఆహ్వాన సంఘం సన్నాహక సమావేశం

సమావేశంలో మాట్లాడుతున్న ఎం సాయిబాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిఐటియు తెలంగాణ రాష్ట్ర 5వ మహాసభను విజయవంతం చేసేందుకుగాను జిల్లా కేంద్రమైన మెదక్ పట్టణంలో ఈ నెల 19వ తేదీన ఆహ్వాన సంఘం సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నట్టు యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు తెలిపారు. మెదక్ పట్టణంలోని కేవల్ కిషన్ భవన్‌లో గురువారం జరిగిన సిఐటియు జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. డిసెంబర్ ఏడు నుంచి 9వ తేదీ వరకు నిర్వహించనున్న రాష్ట్ర మహాసభలను విజయవంతం చేసేందుకుగాను ఈ నెల 19న ఉదయం 10.30 గంటలకు మెదక్ పట్టణంలోని బాలాజీ ఫంక్షన్ హాల్‌లో ఆహ్వాన సంఘం సన్నాహక సమావేశం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కార్మికులు, ఉద్యోగుల సమస్యలపై పోరాటాలు నిర్వహిస్తున్న సిఐటియు తెలంగాణ రాష్ట్ర ఐదువ మహాసభలు మెదక్ జిల్లాలో మొదటిసారిగా నిర్వహిస్తున్నామన్నారు. ఆహ్వాన సంఘం సమావేశానికి సిఐటియు జాతీయ కోశాధికారి ఎం. సాయిబాబు, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, నవతెలంగాణ దినపత్రిక మాజీ సంపాదకులు ఆర్ సుధాభాస్కర్ హాజరు కానున్నారని తెలిపారు. జిల్లాలో 40 ఏళ్లుగా కార్మికులు, స్కీమ్ వర్కర్ల సమస్యలు, హక్కుల పరిరక్షణ కోసం పోరాటాలు నిర్వహించి విజయాలు సాధించిన సంఘం సీఐటీయూ అని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పని గంటలు పెంచి కార్మికులపై భారాలు వేసి, పెట్టుబడిదారులకు మేలు చేస్తున్నారని విమర్శించారు. 9న దేశవ్యాప్తంగా జరిగిన సమ్మెలో 25 కోట్ల మంది పాల్గొన్నారని, ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం కండ్లు తెరవాలన్నారు. రాష్ట్రంలో పనిచేస్తున్న ఆశా, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన కార్మికులు, గ్రామపంచాయతీ, మున్సిపాలిటీ కార్మికుల వేతనాలు రెగ్యులర్‌గా చెల్లించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. కార్మికుల హక్కుల కోసం పోరాడుతున్న సీఐటీయూ రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం సమావేశానికి కార్మికులు, మేధావులు, శ్రేయోభిలాషులు, ప్రజలు హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అడివయ్య, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బి బాలమణి, కార్యదర్శి ఎ మల్లేశం, కోశాధికారి కె నర్సమ్మ, ఉపాధ్యక్షులు మహేందర్ రెడ్డి, నాగరాజు, సహాయ కార్యదర్శి గౌరయ్య, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కె మల్లేశ్, నాయకులు అజయ్ తదితరులు పాల్గొన్నారు.



ఆగస్టులో క్రెడాయ్ ప్రాపర్టీ షో

- హైటెక్స్‌లో మూడు రోజుల పాటు ఏర్పాటు
- హైదరాబాద్ చుట్టు పక్కాల రియాల్టీ వృద్ధి
- అధ్యక్షుడు జైదీప్ రెడ్డి వెల్లడి
- ప్రదర్శన బ్రోచర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

రియల్ ఎస్టేట్ డెవలపర్ల సంస్థ కాన్ఫెడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్స్ ఆఫ్ ఇండియా (క్రెడాయ్) హైదరాబాద్ చాప్టర్ నగరంలో మెగా ప్రాపర్టీ షో ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. ఆగస్టు 15 నుంచి క్రెడాయ్ హైదరాబాద్ ప్రాపర్టీ షో-2025ను హైటెక్స్‌లోని హాల్1, 3లో నిర్వహించనున్నట్లు వెల్లడించింది. గురువారం నగరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో క్రెడాయ్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎన్ జైదీప్ రెడ్డి మాట్లాడుతూ.. ఇళ్ల కొనుగోళ్లకు ఇది సరైన సమయం అన్నారు. హైదరాబాద్ నగరం కేవలం పశ్చిమ ప్రాంతంలోనే డిమాండ్ ఉందనేది ఒక అపోహ మాత్రమేనన్నారు. నగరం చుట్టు పక్కాల రియాల్టీ అభివృద్ధి చెందుతుందన్నారు. దక్షిణ, ఉత్తర, ఈశాన్య ప్రాంతాలోని నిర్మాణాలకు మంచి డిమాండ్ ఉందన్నారు. అయితే పశ్చిమ ప్రాంతంలోని నిర్మాణాలకు సంబంధించిన ఎక్కువ వాణిజ్య ప్రకటనలు ఆ ఏరియాను హైలెట్ చేస్తున్నాయన్నారు. ఫ్యూచర్ సిటీలో రాష్ట్ర ప్రభుత్వం చురుకుగా మౌలిక వసతులను అందుబాటులోకి తెస్తుందన్నారు. రియాల్టీకి ప్రధానంగా మౌలిక వసతులే ప్రధాన మద్దతును అందిస్తాయన్నారు. రాష్ట్రంలో స్టాంప్ డ్యూటీని తగ్గించడం ద్వారా నిర్మాణ రంగం వేగాన్ని పెంచడంతో పాటుగా నగదు ప్రవాహాన్ని పెంచవచ్చన్నారు. క్రెడాయ్ హైదరాబాద్ ప్రెసిడెంట్ ఎలెక్ట్ బి జగన్నాథ్ రావు మాట్లాడుతూ.. నగరం అన్ని రంగాల నుంచి పెట్టుబడులను ఆకర్షిస్తుందన్నారు. ఆర్‌బిఐ కూడా వడ్డీ రేట్లను తగ్గించిన వేళ ఇప్పుడు నివాసాల కొనుగోలుకు అత్యుత్తమ సమయమన్నారు.

ప్రదర్శనకు 300 పైగా ప్రాజెక్టులు : కుర్ర శ్రీనాథ్

హైటెక్స్‌లో ఆగస్టు 15, 16, 17 తేదిల్లో మూడు రోజుల పాటు ఏర్పాటు చేయనున్న ప్రాపర్టీ షోను ఇంతక్రితంతో పోల్చితే మరింత ఆకర్షణీయంగా నిర్వహించనున్నట్లు క్రెడాయ్ కన్వీనర్ కుర్ర శ్రీనాథ్ అన్నారు. ఇక్కడ 70 ప్రముఖ సంస్థలు తమ 300 పైగా ప్రాపర్టీలను ప్రదర్శనకు ఉంచనున్నాయన్నారు. చౌక ధర ప్లాట్ల నుంచి హైరైజ్ బిల్డింగ్‌లు, విల్లాలను ఇక్కడ ఎంపిక చేసుకోవచ్చని సూచించారు. ప్రాపర్టీ షోలో ఈ దఫా ఎంటర్‌టైన్‌మెంట్‌ను అందించనున్నట్లు వెల్లడించారు. కుటుంబాల కోసం ప్రత్యక్ష కళా ప్రదర్శనలు, ఉత్సాహభరితమైన సంగీత ప్రదర్శనలు, నిపుణుల సెషన్లు, ఫుడ్ స్టాళ్లు తదితర వాటిలో సరదాగా గడపవచ్చన్నారు. హైదరాబాద్ వేగంగా పెరుగుతున్న నగరం మాత్రమే కాదని.. మౌలిక సదుపాయాలు, టెక్నాలజీతో సమపాళ్లలో అభివృద్ధి చెందుతున్న స్మార్ట్ నగరమని తెలిపారు. ప్రతీ వారాంతంలో కొత్త నివాసాల కోసం వెతికే బదులు క్రెడాయ్ ప్రాపర్టీలో సులభంగా ఎంపిక చేసుకోవచ్చని సూచించారు.

ఈ సమావేశంలో ఆ సంస్థ ప్రధాన కార్యదర్శి కె కాంతి కిరణ్ రెడ్డి, సహ కన్వీనర్ అరవింద్ రావు మెచినేని, కార్యవర్గ సభ్యులు మనోజ్ కుమార్ అగర్వాల్, కె. అనిల్ రెడ్డి, ఉపాధ్యక్షులు వై. రవి ప్రసాద్, ట్రెజరర్ నితీష్ రెడ్డి గుడూరు, జాయింట్ సెక్రటరీలు సంజయ్ కుమార్ బన్సాల్, శ్రీరామ్ ముసునూరు పాల్గొన్నారు.

గ్రామ పరిపాలన అధికారిగా విఆర్ఎ వారసులకు అవకాశం కల్పించండి

- విఆర్ఎ జెఎసి రాష్ట్ర కన్వీనర్ వంగూరు రాములు డిమాండ్

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న విఆర్ఎలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విఆర్ఎ వారసులకు గ్రామ పరిపాలన అధికారిగా అవకాశం కల్పించాలని విఆర్ఎ జెఎసి రాష్ట్ర కన్వీనర్, సిఐటియు రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు డిమాండ్ చేశారు. నిజామాబాద్ కలెక్టరేట్ ఎదుట విఆర్ఎలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వంగూరు రాములు మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో విఆర్ఎలు 84 రోజుల సుదీర్ఘ సమ్మె పోరాట ఫలితంగా జీవో 81, 85ను జులై 2023లో విడుదల చేశారని చెప్పారు. కానీ అదే సమయంలో ఎన్నికలు రావడం, అప్పుడున్న ప్రభుత్వం మారడం లాంటి పరిణామాలు జరిగి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో జీవో అమల్లోకి రాలేదని తెలిపారు. ప్రభుత్వం భూ భారతి చట్టం 2025 తర్వాత ఆర్డర్లు ఇస్తారని కోటి ఆశలతో 3797 వీఆర్ఏ కుటుంబాలు ఎదురుచూస్తున్నాయని తెలిపారు. ఈ 3797మంది వీఆర్ఏల్లో 61 ఏండ్లు నిండిన వారి వారసుల వివరాలు ప్రభుత్వం 20 నెలల క్రితమే తీసుకున్నదని అన్నారు. కాబట్టి వీరికి కూడా జీపీవోలో అవకాశం కల్పించి నియామక ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. జీవో వచ్చిన సందర్భంలో కుటుంబ సభ్యుల నుంచి నో అబ్జెక్షన్ అడిగిన విషయంలో ప్రభుత్వ ఉద్యోగమన్న ఆశతో కుటుంబ సభ్యులు వారికున్న ఆస్తుల్లో వాటా వదులుకోవడం, ఆస్తులు లేని వారు అప్పులు తెచ్చి ఇచ్చారని చెప్పారు. దాంతో మానసిక ఒత్తిడికి గురై ఇప్పటివరకు దాదాపు 70 మంది వారసులు చనిపోయారని, అలాగే వయోభారంతో 61 ఏళ్లు నిండిన దాదాపు 400 మంది వరకు విఆర్ఎలు చనిపోయారని తెలిపారు. కాబట్టి ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని లేకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం అదనపు కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్, విఆర్ఎ జిల్లా అధ్యక్షుడు ఇస్త్రరి గంగమల్లు, నిజామబాద్ డివిజన్ అధ్యక్షుడు గోధుమ మోహన్, బోధన్ డివిజన్ అధ్యక్షుడు కరుణాకర్, వీఆర్ఏలు పాల్గొన్నారు.

కీర్తిలాల్స్‌కు రెండు అవార్డులు

హైదరాబాద్: కీర్తిలాల్స్ జ్యువెల్లరీ 2025 జ్యువెల్లరీ ఎమినెన్స్ అవార్డ్స్‌లో రెండు ప్రతిష్టాత్మక అవార్డులను అందుకున్నట్లు ఆ సంస్థ తెలిపింది. ఇందులో "డైమండ్ కలర్డ్ చెవిపోగులు ఆఫ్ ది ఇయర్‌గా, "థీమ్ ఆఫ్ ది ఇయర్: రాయల్ డి ఆర్ట్" అవార్డులను గెలుచుకున్నట్లు పేర్కొంది. జైపూర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో నటి షాజాన్ పదమ్సీ అవార్డులను ప్రదానం చేశారని కీర్తిలాల్స్ బిజినెస్ స్ట్రాటజీ డైరెక్టర్ సూరజ్ శాంత కుమార్ తెలిపారు. ఈ విజయం ఆభరణ రంగంలో కీర్తిలాల్స్ అగ్రగామి స్థానాన్ని మరింత బలోపేతం చేసిందన్నారు.

IN THE COURT OF THE PRINCIPAL DISTRICT JUDGE WEST GODAVARI, ELURU
A.S.No.65/2024

Between:
Nallamothula Naga Venkata Satya Srinivasa Rao & others ... **APPELLANTS**
And
Erla Naga Venkata Satyavathi And others ... **RESPONDENTS**

NOTICE

10. Alluri Gangaratnam, D/o. Lakshmaiah, Wife of Nageswara Rao, properties, Resident of Kandukuru, Khammam District.
Whereas the Appellants filed appeal against the Decree and Judgement in O.S.No.308/2015 on the file Principal Civil Judge (Senior Division) Eluru dated 18-12-2023. The Honourable court order notice to respondents in 8 & 9 in the above appeal.
Whereas as the notice addressed to the 10th respondent in the above Appeal could not be served as last known;
Whereas the Honorable court ardered notice to 10th respondent in the above Appeal by substituted service by way of publication;
You, are hereby called upon to appear in person before this Honourable court Eluru on 31-07-2025 at 10-30 A.M and state your objections if any. Lest the Appeal will be decided ex-parte.
(As per court orders)
DEVULAPALLI KRISHNA SASTRY
Eluru Advocate,
Date: 07-07-2025 Eluru

మహారాజశ్రీ అద్దంకి సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
E.P.No.27/2018
IN
O.S.No.206/2014

ఉప్పలపాటి రామమోహనరాజు .....డి.హెచ్.ఆర్
Vs.
నాదెండ్ల సృజని ..... జె.డి.ఆర్

ప్రకటన.

To:
జె.డి.ఆర్
నాదెండ్ల సృజని W/o వేంకటేశ్వరరావు,
లోటస్ రెసిడెన్సి డోరు నెంబరు :G.2,
హౌస్ నెంబరు:6-9-30,హరిత(వాణి)వనంకాలనీ,
బాచుపల్లి గ్రామం-500090,రంగారెడ్డి జిల్లా,
తెలంగాణా రాష్ట్రం,

పై నంబరు అమలు పిటీషన్‌లో మీకు సి.పి.సి. ఆర్డరు 21 రూల్ 66 ప్రకారము మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపినప్పటికి మీరు దురుద్దేశ్య పూర్వకముగా తీసుకొనక తిరిగిపంపుచున్నందు వలన మీకు పైఅమలు పిటీషన్‌లో నోటీసును ఈ ప్రకటన ద్వారా కోర్టువారు జారీచేసి మీహాజరు నిమిత్తం ఈ పిటీషన్‌ను తేది.31-07-2025 నకు వాయిదా వేశారు. కావున మీరు ఆతేదిన ఉదయం గం.10-30ని.లకు పైకోర్టువారి ఏదుట స్వయముగా గానీ, వకీలు ద్వారా గానీ హాజరై పైఅమలు పిటిషన్ లో మీఆక్షేపణలను తెలియజేయవలెను. లేని ఏడల పైఅమలు పిటిషన్‌ను మీపరోక్షమందు తీర్మానించ దరని తెలియ జేయడమయినది.

// శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో //
వజ్రాల అంజిరెడ్డి,
మారం శ్రీనివాసరావు
తాడికొండ ప్రసాద్‌బాబు.
డి.హెచ్.ఆర్. తరుపు న్యాయవాదులు.
అద్దంకి

నూతన భారతాన్ని నిర్మించడమే మా లక్ష్యం

- దేశంలో మతవిద్వేషాలను రెచ్చగొడుతున్న ఫాసిస్టు శక్తులు
- సిపిఐ ప్రధాన కార్యదర్శి డి రాజా
- సోషలిస్టు వ్యవస్థలోనే అసమానతలుండవు : జాన్‌వెస్లీ, సురవరం
- ఘనంగా సిపిఐ రాష్ట్ర కార్యాలయం పున: ప్రారంభం

కార్యక్రమంలో మాట్లాడుతున్న డి రాజా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్ విప్లవానికి కేంద్రం కావాలని ఆ పార్టీ అఖిల భారత ప్రధాన కార్యదర్శి డి రాజా ఆకాంక్షించారు. సమస్యలతో బాధపడే ప్రజలు ఈ కార్యాలయానికి రావాలన్నారు. నూతన భారతాన్ని నిర్మించడమే తమ పార్టీ లక్ష్యమని చెప్పారు. వర్గరహిత, కులరహిత సమాజాన్ని నిర్మిస్తామని వివరించారు. బీహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ పేరుతో ఒక వర్గానికి చెందిన ప్రజల ఓట్లను తొలగించేందుకు ఎన్నికల కమిషన్ (ఇసి) ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. బీహార్ మాదిరిగానే తెలంగాణ, ఎపి, పశ్చిమబెంగాల్, కేరళ తదితర రాష్ట్రాల్లో ఓటర్లను తొలగించే ప్రమాదముందని చెప్పారు. ఈ విషయంలో ప్రజలు, ప్రజాస్వామ్య పార్టీలు అప్రమత్తంగా ఉండాలన్నారు. గురువారం హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లో పున:నిర్మాణం చేసిన సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్ ప్రారంభోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యాలయాన్ని సిపిఐ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపి సురవరం సుధాకర్‌రెడ్డి ప్రారంభించారు.

అనంతరం నిర్వహించిన సభలో రాజా మాట్లాడుతూ దేశంలో ప్రతి పౌరుడికీ ఓటు హక్కు కల్పించి నిష్పక్షపాతంగా, స్వేచ్ఛగా ఎన్నికలు నిర్వహించాల్సిన రాజ్యాంగ బద్ధమైన సంస్థ ఎన్నికల కమిషన్ చర్యలు ఓటర్లకు ప్రమాదకరంగా మారాయన్నారు. రాజ్యాంగాన్ని, దేశాన్ని కాపాడాల్సిన బాధ్యత లౌకిక, ప్రజాస్వామిక శక్తులపై ఉందని చెప్పారు. దేశం ప్రస్తుతం సంక్లిష్ట పరిస్థితుల్లో ఉందన్నారు. అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని అన్నారు. కేంద్రంలో మతతత్వ శక్తులు అధికారంలో ఉన్నాయని చెప్పారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని మార్చేందుకు కుట్ర చేస్తున్నాయని విమర్శించారు. దేశంలో మత విద్వేషాలను రెచ్చగొడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగం నుంచి సెక్యులర్, సోషలిస్టు పదాలను తొలగించడమే లక్ష్యంగా పెట్టుకుందన్నారు. రాజ్యాంగాన్ని, దేశాన్ని కాపాడి ముందుకు తీసుకుపోవాల్సిన బాధ్యత లౌకిక, ప్రజాస్వామ్య, వామపక్ష శక్తులపై ఉందని చెప్పారు.

ప్రపంచంలో దోపిడీ కొనసాగినంత కాలం కమ్యూనిస్టులుంటారని సిపిఐ మాజీ ప్రధాన కార్యదర్శి సువరం సుధాకర్ రెడ్డి అన్నారు. ప్రపంచ వ్యాపంగా నేడు తీవ్ర సంక్షోభంతోపాటు యుద్ధ వాతావరణం నెలకొందన్నారు. అమెరికా అధ్యక్షులు ట్రంప్ ఎన్నికైన తర్వాత యుద్ధ ప్రమాదాలు మరింత తీవ్రతరమయ్యాయని అన్నారు. ఫలితంగా నిరుద్యోగం పెరిగి ప్రజల జీవితాలు దుర్భరంగా మారుతున్నాయని వివరించారు. మోడీ పాలనలో కార్మికులు, యువకులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని అన్నారు. పెటుబడిదారీ విధానం సంక్షోభంలో ఉందన్నారు. మోడీ పాలనలో ఫాసిస్టు పాలన కొనసాగుతోందని విమర్శించారు. వర్గ పోరాటాలను మందుకుతీసుకుపోవాలని ఆయన పిలుపునిచ్చారు.

సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకే ఆపరేషన్ కగార్ : మహేష్‌కుమార్‌గౌడ్

కమ్యూనిస్టులు, కాంగ్రెస్‌కు మధ్య విడదీయరాని అనుబంధం ఉందని టిపిసిసి అధ్యక్షులు బి మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు.

ఇది ఇలాగే కొనసాగాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులోనూ కలిసి నడుద్దామనీ, రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుందామని చెప్పారు. కమ్యూనిస్టు భావజాలానికి మరణం లేదనీ, సిద్ధాంతాలకు కొదవలేదని, నాయకత్వం వస్తూనే ఉంటుందని వివరించారు. సిపిఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ దేశంలో న్యాయవ్యవస్థను కాపాడాలని కోరారు. నక్సలైట్లను చంపొచ్చు కానీ నక్సలిజాన్ని చంపలేరని అన్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమాలకు వేదికగా మఖ్దూంభవన్ ఉందన్నారు. మావోయిస్టులతో రాష్ట్ర ప్రభుత్వం శాంతిచర్చలు జరిపి దేశానికే ఆదర్శంగా నివాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సూచించారు. హైదరాబాద్‌లో రాజ్‌బహదూర్‌గౌర్ విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు.

మతోన్మాద శక్తులను గద్దెదించాలి : జాన్‌వెస్లీ

దేశంలో మతోన్మాద శక్తులను గద్దెదించడం కోసం లౌకిక, వామపక్ష, ప్రజాస్వామిక, అభ్యుదయవాదులందరూ కలిసి కృషి చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ పిలుపునిచ్చారు. పేద, ధనిక, కుల, మత, స్త్రీ, పురుష అసమానతల్లేని, సమాజ నిర్మాణానికి, సోషలిస్టు బావాలను ముందుకు తీసుకెళ్లే విషయంలో దోపిడీ వర్గాలకు కమ్యూనిస్టులు, కమ్యూనిస్టు బావాలు కలిగిన వారే ప్రత్యామ్నాయం అవుతారని అన్నారు. ఆ దిశగా ప్రత్యామ్నాయ ఉద్యమాలను ముందుకు తీసుకెళ్లేందుకు అందరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు వేములపల్లి వెంకట్రామయ్య, సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం హన్మేష్, ఆరెస్పీ రాష్ట్ర కార్యదర్శి జానకి రాములు తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ కార్యదర్శులు అజీజ్‌పాషా, బాలచంద్రకాంగో, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి, పశ్యపద్మ, పల్లా వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, మీడియా అకాడమి ఛైర్మెన్ కె శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుల కోసం చాలా చేస్తున్నాం

- ఏదాదిలోనే పలు అభివృద్ధి కార్యక్రమాలు
- ఇందిరమ్మ ఇళ్లలో ఐదు శాతం రిజర్వేషన్లు
- పదేళ్ల పాలనలో వారిపై పూర్తి నిర్లక్ష్యం : ముత్తినేని వీరయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గత పదేండ్ల కాలంలో బిఆర్ఎస్ ప్రభుత్వం వికలాంగుల పట్ల పూర్తి నిర్లక్ష్యాన్ని ప్రదర్శించిందని తెలంగాణ వికలాంగుల కార్పొరేషన్ చైర్మెన్ ముత్తినేని వీరయ్య విమర్శించారు. చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా గురువారం హైదరాబాద్‌లోని కార్పొరేషన్ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. వికలాంగుల సంక్షేమం అభివృద్ధిలో రాష్ట్రం అగ్రస్థానంలో నిలిచిందని చెప్పారు. ఉన్నత విద్యలో ఐదు శాతం రిజర్వేషన్‌లను అమలు చేస్తున్నట్టు తెలిపారు. రాజీవ్ యువ వికాసం ద్వారా ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ, ఇబిసి కార్పొరేషన్ల ద్వారా ఐదు శాతం రిజర్వేషన్ వల్ల సుమారు రూ.300కోట్లు వచ్చే అవకాశం ఉందన్నారు. 23వేల మంది వికలాంగులు స్వయం సమృద్ధి పొందుతారని చెప్పారు. వారికి ఉచితంగా అందించే సహాయ ఉపకరణాలు (ట్రై మోటరైజడ్ స్కూటీలు) 40 శాతం బెంచ్ మార్క్ వైకల్యానికే అందించేలా చట్టం చేశామన్నారు. కార్పొరేషన్‌లో పని చేస్తున్న వికలాంగ ఉద్యోగులకు 2010, 2015, 2020 పిఆర్‌సిలు అందించేందుకు చట్టం చేసినట్టు గుర్తుచేశారు. ఇందిరమ్మ ఇళ్లలో ఐదు శాతం రిజర్వేషన్ కల్పిస్తున్నామని చెప్పారు. క్రీడా విధానంలోనూ భారీ పారితోషకాలు అందిస్తున్నట్టు వివరించారు. వికలాంగులను వికలాంగులే పెళ్లి చేసుకుంటే కల్యాణలక్ష్మితో పాటు అదనంగా రూ. లక్ష ప్రోత్సాహకాన్ని అందిస్తున్నామని చెప్పారు. వికలాంగులు స్వయం సమృద్ధి సాధించేలా 705 మందికి ఒక్కొక్కరికి రూ. 50 వేలచొప్పున రుణాలు అందించామన్నారు. 2,367 వికలాంగుల పొదుపు సంఘాలను ఏర్పాటు చేసి ఒక్కో సంఘానికి రూ. 15వేల చొప్పున రూ. 3.55 కోట్లు విడుదల చేశామన్నారు. అంగవైకల్యం బారిన పడిన చిన్న పిల్లలను గుర్తించి వారికి అన్ని రకాలుగా తోడ్పాటు అందిస్తూ వైకల్యం నుంచి విముక్తి పొందేలా "బాల భరోసా" కార్యక్రమం ప్రారంభించామన్నారు. గత పదేండ్లలో కార్పొరేషన్‌కి రూ.64 కోట్లు కేటాయిస్తే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 18 నెలల్లోనే రూ. 100 కోట్లు బడ్జెట్ కేటాయింపులు చేసుకుని వికలాంగుల అభివృద్ధికి బాటలు వేశామని చెప్పారు.

ప్రముఖ న్యాయవాది సుందరయ్య కన్నుమూత

- బివి రాఘవులు, జాన్‌వెస్లీ నివాళి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిపిఎం నాయకులు అచ్యుత రామయ్య అల్లుడు, పుట్టగుంట సుబ్బారావు కుమారుడు ప్రముఖ న్యాయవాది సుందరయ్య (71) కన్నుమూశారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన గురువారం హైదరాబాద్‌లో తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులున్నారు. ఆయన భౌతిక కాయాన్ని శుక్రవారం ఉదయం ఏడు నుంచి పది గంటల వరకు వారి స్వగృహం హైదరాబాద్‌లోని ఆర్‌టిసి క్రాస్‌రోడ్స్‌లో ఉన్న దత్తసాయి అపార్ట్‌మెంట్ వద్ద ప్రజల సందర్శనార్థం ఉంచుతారు. ఆ తర్వాత బన్సీలాల్‌పేట్‌లోని శ్మశాన వాటికలో అంత్యక్రియలను నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు. సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ సుందరయ్య భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన మరణం పట్ల సంతాపం, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు.

లారీ, కారు ఢీకొని ఇద్దరు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

లారీ, కారు ఢీకొని ఇద్దరు మృతిచెందిన ఘటన రంగారెడ్డి జిల్లా కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలో జాతీయరహదారిపై బుధవారం అర్ధరాత్రి జరిగింది. దారు. మృతుల్లో జండాగూడెం మాజీ సర్పంచ్ ఉన్నారు. కొత్తూర్ ఎస్ఐ గోపాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. జండాగూడెం మాజీ సర్పంచ్ చంద్రశేఖర్‌రెడ్డి (50) తన కారులో నందిగామ మండలం దేవుని మామిడిపల్లి గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌రెడ్డి (45)తో కలిసి స్వగ్రామం అయిన జండాగూడెంకు వెళ్తున్నారు. ఈ క్రమంలో కారును ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మాజీ సర్పంచ్ చంద్రశేఖర్ రెడ్డి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందారు. గాయపడిన మరో వ్యక్తిని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

వేడుకగా ఎస్‌సిడిఎల్ సిల్వర్ జూబ్లీ ఉత్సవాలు

హైదరాబాద్, జూలై 2025: సింబియోసిస్ సెంటర్ ఫర్ డిస్టెన్స్ లెర్నింగ్ (ఎస్‌సిడిఎల్) తమ 25 సంవత్సరాల సందర్భంగా సిల్వర్ జూబ్లీ వేడుకలను హైదరాబాద్‌లో కెరీర్ గ్రోత్ సెమినార్‌తో జరుపుకున్నట్లు పేర్కొంది. ఈ కార్యక్రమంలో డేల్ కార్నెగీ లీడర్‌షిప్ మాస్టర్‌క్లాస్, హెచ్‌ఆర్ రౌండ్‌టేబుల్, కెరీర్ కౌన్సెలింగ్ సెషన్‌లు నిర్వహించబడ్డాయని తెలిపింది. విద్యార్థులు, నిపుణులు, పూర్వ విద్యార్థులకు నాయకత్వ నైపుణ్యాలు, కెరీర్ మార్గదర్శనం అందించినట్లు ఎస్‌సిడిఎల్ చీఫ్ ఆపరేషన్స్ నిఖిల్ వైద్య తెలిపారు.

నేడు గచ్చిబౌలి స్టేడియంలో రాజ భాషా దక్షిణ సంవాదం

- కేంద్ర మంత్రి జి కిషన్‌రెడ్డి హాజరు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాజభాషా విభాగం ఏర్పడి 50 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో "దక్షిణ సంవాదం" పేరిట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు డిపార్ట్‌మెంట్ ఆఫ్ అఫిషియల్ లాంగ్వేజెస్ సంయుక్త కార్యదర్శి మీనాక్షి జోలి తెలిపారు. గురువారం సికింద్రాబాద్‌లోని సిసిజి టవర్స్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ హిందీని మరింతగా అభివృద్ధి చేసేందుకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో స్థాపితమైన ఈ విభాగం జూన్ 26 నాటికి ఐదు దశాబ్దాలు పూర్తి చేసుకుందని చెప్పారు. ఈ క్రమంలో స్వర్ణజయంతి రెండో వేడుకలను దక్షిణాదిన హైదరాబాద్ కేంద్రంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రులు జి కిషన్‌రెడ్డి, నిత్యానంద్‌రాయ్, రాజ్యసభ ఉపసభాపతి హరివంశ్, ఎపి ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హాజరవుతారని తెలిపారు. అలాగే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ తమిళనాడు, కేరళ, కర్ణాటక, పుదుచ్చేరి రాష్ట్రాల నుంచి ఉన్నదాధికారులు, విద్యావేత్తలు, భాషా ప్రేమికులు పెద్ద సంఖ్యలో హాజరవుతారని వివరించారు. స్వర్ణ జయంతి సంవత్సరాన్ని పురస్కరించుకొని నిర్వహించిన క్రీడాపోటీల విజేతలకు ఈ సందర్భంగా పురస్కారాలను అందజేస్తామని తెలిపారు.

కల్తీ కల్లు బాధ్యులపై చర్య తీసుకోవాలి

- మృతుల కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలి : కెజికెఎస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కల్తీ కల్లు బాధ్యులపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని కల్లుగీత కార్మిక సంఘం (కెజికెఎస్) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎంవీ రమణ, బెల్లకొండ వెంకటేశ్వర్లు ఒక ప్రకటన విడుదల చేశారు. మృతుల కుటుంబాలకు నష్టపరిహారాన్ని చెల్లించాలని కోరారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పరిధిలోని కూకట్ పల్లిలో (హైదర్ గూడ, షంషీగూడ ఇందిరానగర్, కల్లు డిపోలు) కల్లు తాగి ఆరుగురు చనిపోయారని తెలిపారు. మరి కొంతమంది అస్వస్థకు గురయ్యారని పేర్కొన్నారు. కల్లులో కల్తీ చేయటం వల్ల ఈ దుర్ఘటన జరిగినట్టు తెలిసిందనీ, ఇదే నిజమైతే కల్తీకి పాల్పడిన వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఢిల్లీ పబ్లిక్ స్కూల్ బస్సు దగ్ధం

- అప్రమత్తమైన డ్రైవర్, క్లీనర్
- సురక్షితంగా బయటపడ్డ పిల్లలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రయివేటు స్కూల్ విద్యార్థులకు భద్రత కరువయ్యింది. ఓ స్కూల్ బస్సుకు మంటలు అంటుకుని బస్సు పూర్తిగా దగ్ధమయ్యింది. డ్రైవర్, క్లీనర్ అప్రమత్తమయ్యి విద్యార్థులను కిందికి దించడంతో పిల్లలంతా సురక్షితంగా బయటపడ్డారు. దాంతో అంతా ఊపిరి పీల్చుకున్నట్టయింది. పూర్తి వివరాల్లోకి వెళితే.. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని కళ్యాణి వెంచర్, రెన్లగడ్డ సమీపంలో గురువారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్ బస్సు విద్యార్థులను రోజు లాగే పికప్ చేసుకొని ఉదయం ఎనిమిది గంటల సమయంలో స్కూల్‌కు వస్తోంది. ఆ సమయంలో బ్యాటరీ సమీపంలోని వైర్లు మెల్ట్ కావడంతో ఒక్కసారిగా బస్సులో పొగలు, మంటలు చెలరేగాయి. దాంతో విద్యార్థులు కేకలు వేయడంతో వెంటనే అప్రమత్తమైన డ్రైవర్ నర్సింలు, క్లీనర్‌తో కలిసి బస్సులో ఉన్న ఆరుగురు విద్యార్థులను కిందకు దింపేశారు. వెంటనే డ్రైవర్ స్కూలు యాజమాన్యానికి ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వడంతో, స్కూల్ యాజమాన్యం అప్రమత్తమై పోలీసులకు సమాచారం అందజేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న అమీన్‌పూర్ పోలీసులు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం చేరవేశారు. అప్పటికే బస్సు సగభాగం కాలిపోయింది. సంఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది, ఎగిసిపడుతున్న మంటలను అదుపు చేశారు. ఘటన గురించి తెలుసుకొని అక్కడికి చేరుకున్న ఆర్‌డిఓ విజయ్ రావు మాట్లాడుతూ.. ఉదయం ఎనిమిది గంటల సమయంలో స్కూల్ విద్యార్థుల పికప్‌కు వెళ్లిన ఢిల్లీ పబ్లిక్ స్కూల్ బస్సు కల్యాణి వెంచర్, రేన్లగడ్డ సమీపంలోని అపార్ట్‌మెంట్ దగ్గరలో ఉన్న విద్యార్థులను పికప్ చేసుకుని వస్తున్న సమయంలో బ్యాటరీ దగ్గర ఒక్కసారిగా పొగలు రావడంతో, విద్యార్థులు కేకలు వేసినట్టు తెలిపారు. గమనించిన అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్, డ్రైవర్‌ను అప్రమత్తం చేయడంతో వెంటనే బస్సులోని విద్యార్థులను కిందకు దింపడంతో పెను ప్రమాదం తప్పిందని చెప్పారు. ఫైర్ ఇంజన్ సిబ్బంది బస్సులో నుంచి ఎగిసిపడుతున్న మంటలను అదుపు చేశారన్నారు. ఇలాంటి ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్కూల్ యాజమాన్యానికి సూచించారు.

బసవతారకనగర్ గుడిసె వాసులపై.. మళ్లీ గూండాల దాడి

- పలువురికి గాయాలు
- ఖాళీ చేయాలని హుకుం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గచ్చిబౌలి డివిజన్ గౌలిదొడ్డి విలేజీ పరిధిలోని బసవతారక నగర్‌లో కొద్ది రోజులుగా గుడిసెవాసులపై ప్రయివేట్ వ్యక్తులు దౌర్జన్యానికి పాల్పడుతున్నారు. తాజాగా బుధవారం అర్ధరాత్రి, గుర్తుతెలియని వ్యక్తులు వందల సంఖ్యలో ఒకేసారి గుడిసెవాసులపై దాడికి పాల్పడ్డారు. రాడ్లు, కర్రలు తీసుకొని వచ్చి పేదలపై మూకుమ్మడిగా దాడి చేశారు. ఇక్కడి నుంచి ఖాళీ చేసి వెళ్తారా లేదా అంటూ.. ఖాళీ చేయకుంటే వారిని చంపేస్తామంటూ బెదిరింపులకు పాల్పడ్డారు. ఈ దాడిలో ముత్తు అనే వ్యక్తికి గాయాలు కాగా అతన్ని ఆస్పత్రికి తరలించారు. కొంతమంది మహిళలు సైతం గాయపడ్డారు. అయితే కొంతమంది గుండాలను పట్టుకుని స్థానికులు పోలీసులకు అప్పగించారు. గుడిసెవాసులు తెలిపిన వివరాల ప్రకారం..

బసవతారకనగర్‌లో సుమారు 40 ఏండ్ల నుంచి పేదలు ఇక్కడే నివాసం ఉంటున్నారు. అయితే పది రోజుల క్రితం కొంతమంది వ్యక్తులు అక్కడున్న కుటుంబాలను భయపెట్టి ఖాళీ చేయించారు. మరి కొంతమంది వ్యక్తులు అక్కడ నుంచి కదిలేది లేదని తేల్చి చెప్పారు.

దాంతో ప్రయివేట్ వ్యక్తులు వీరిపై దాడి చేసి, గుడిసెలను ధ్వంసం చేశారు. ఈ విషయం రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. విషయం తెలుసుకున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ మంగళవారం బసవతారకనగర్‌లో పర్యటించారు. బాధితులకు మద్దతుగా నిలిచారు. వారిని అండగా ఉంటామని భరోసానిచ్చారు. సిపిఎం, ఇతర ప్రజాసంఘాల మద్దతును జీర్ణించుకోలేని ప్రయివేట్ వ్యక్తులు మళ్లీ పేదలపై దౌర్జన్యానికి పాల్పడ్డారు. బాధ్యులపై ఇప్పటికైనా చర్యలు తీసుకుని, తమకు రక్షణ కల్పించాలని బాధితులు కోరుతున్నారు. ఈ ఘటనపై దీనిపై సిపిఎం నాయకులు శోభన్, కృష్ణ స్పందిస్తూ.. గచ్చిబౌలి డివిజన్ గౌలిదొడ్డి విలేజ్ బసవతారకనగర్ ప్రజలపై కొంతమంది వ్యక్తులు చేస్తున్న దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. దాడులకు పాల్పడిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పేద ప్రజలపై ప్రయివేట్ వ్యక్తులు ఇలా దాడి చేయడం ఏమాత్రం సమంజనం కాదన్నారు.

తప్పుడు పత్రాలతో ఎయిర్‌పోర్టుకు వచ్చిన వ్యక్తి అరెస్టు

- నిందితుడికి 14 రోజుల రిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తప్పుడు ధ్రువపత్రాలతో ఆగ్రా నుంచి హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మీదుగా బెంగళూరు వెళ్లడానికి వచ్చిన వ్యక్తిని శంషాబాద్ ఎయిర్‌పోర్టులో అధికారులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో గురువారం జరిగింది. ఆర్‌జీఐ ఎయిర్‌పోర్ట్ పోలీస్ స్టేషన్ అవుట్ పోస్ట్ స్టేషన్ హౌస్ అధికారి జె. బాలరాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. హర్యానాకు చెందిన అమిత్‌కుమార్ 'అవకాశ్' అనే నకిలీ పేరుతో టికెట్లు బుక్ చేసుకుని ఆగ్రా నుంచి హైదరాబాద్‌కు వచ్చాడు. ఇక్కడ శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి బెంగళూరు విమానానికి వెళ్తున్నాడు. గేట్ ఎటిఆర్ఎస్-16 వద్ద భద్రతా సిబ్బంది అతన్ని తనిఖీ చేశారు. తనిఖీల్లో అతని వద్ద తప్పుడు పత్రాలను గుర్తించారు. దాంతో వెంటనే అతన్ని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద ప్రభుత్వం నియామక పరీక్షల్లో మోసం చేయడానికి ఉపయోగించే బ్లూ టూత్ పరికరాలు, అనేక కాపీ అయిన ఆధార్ కార్డులు, పాఠశాల సర్టిఫికెట్లు, జింద్ కాలేజ్ రబ్బరు ముద్ర వంటి అనుమానాస్పద వస్తువులు గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. మోసపూరిత పత్రాలతో బెంగళూరులో జరగనున్న నియామక పరీక్షల్లో కాపీకి సాయపడేందుకు ప్రయాణిస్తున్నట్టు విచారణలో తేలింది. వెంటనే అతనిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. నిందితునికి న్యాయస్థానం 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. రిమాండ్ ముగిసిన తర్వాత నిందితుడిని పోలీస్ కస్టడీకి తీసుకొని.. ఇందులో ఇంకా ఎవరున్నారనే కోణంలో దర్యాప్తు చేపడతామని అధికారులు తెలిపారు.

నిమ్జ్ కార్యాలయంపై ఎసిబి అధికారుల దాడులు

- రూ.15 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ డిప్యూటీ తహసీల్దార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని నిమ్జ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కార్యాలయంపై ఎసిబి అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ సతీష్ రూ. 15 వేలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్నట్టు ఎసిబి డిఎస్‌పి సుదర్శన్ తెలిపారు. ఎసిబి డిఎస్‌పి తెలిపిన వివరాల ప్రకారం.. న్యాల్కల్ మండలంలోని నిమ్జ్ నందు వ్యవసాయ భూమిని కోల్పోయిన రైతులకు రూ.52 లక్షల పైచిలుకు డబ్బులకు సంబంధించిన చెక్కు ఇచ్చేందుకు ఆర్డీఓ రామ్‌రెడ్డికి చెందిన అధికారిక డ్రైవర్ దుర్గయ్య నుంచి గత రెండు మూడు నెలల నుంచి బేరసారాలు జరుపుతున్నారు. చెక్కులు త్వరగా ఇప్పించేందుకు మొదట రూ. నాలుగు లక్షలు డిమాండ్ చేసిన దుర్గయ్య చివరికి లక్ష రూపాయలకు ఒప్పుకున్నారు. అందులో భాగంగా గురువారం స్థానిక నిమ్జ్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ సతీష్ రూ. 15 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజారెడ్డి తన వాటా రూ.50 వేలు తన ఇంటి వద్ద ఇవ్వాలని బాధితులకు తెలిపినట్టు తమ వద్ద రికార్డులు ఉన్నాయని ఎసిబి సుదర్శన్ తెలిపారు. నిందితులు డిప్యూటీ కలెక్టర్ రాజారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ సతీష్, డీల్ కుదిర్చిన ఆర్‌డిఓ అధికారిక డ్రైవర్ దుర్గయ్యను ఎసిబి అధికారులు అరెస్టు చేసి నాంపల్లిలోని ఎసిబి కోర్టులో హాజరు పరిచి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ఎవరైనా లంచం అడిగితే నేరుగా ఎసిబిని సంప్రదించాలని డిఎస్‌పి సుదర్శన్ విజ్ఞప్తి చేశారు. ఇందుకోసం టోల్ ఫ్రీ నెంబర్ 1064ను సంప్రదించాలని తెలిపారు. ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచుతామని, ఎలాంటి భయభ్రాంతులకు గురి కావాల్సిన అవసరం లేదన్నారు.

కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చలేదు

- గత ప్రభుత్వం అడక్కుండానే అన్నీ సమకూర్చింది : కవిత



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజలకు మాయమాటలు చెప్పి అధికారంలోకిచ్చిన కాంగ్రెస్ పార్టీ.. ఒక్క హామీని నెరవేర్చలేదని, భద్రాచలం పరిసరాల్లోని ఐదు గ్రామాలను తెలంగాణలో కలపాలని తెలంగాణ జాగృతి వ్యవస్థాపకులు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం పట్టణంలోని కొత్తగూడెం క్లబ్‌లో నిర్వహించిన జాగృతి సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల్లో మహిళలకు, వికలాంగులకు, యువతకు, విద్యార్థులకు, వృద్ధులకు బిఆర్ఎస్ పార్టీ ఇచ్చిన పథకాల కంటే ఎక్కువే ఇస్తామని అబద్ధపు, మోసపు మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన సిఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం హామీలను అమలు చేయకుండా పబ్బం గడుపుతున్నారని ఆరోపించారు. మహిళలకు నెలకు రూ.2,500, వికలాంగులకు రూ. ఎనిమిది వేల పెన్షన్, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకం ద్వారా తులం బంగారం ఏమైందని ప్రశ్నించారు. సెక్రటేరియట్ వాస్తు బాగలేదని పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మంత్రులతో, అధికారులతో సమావేశాలు పెడుతున్న సిఎం గారూ.. మహిళలకు ఇచ్చిన హామీలపై పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లోనే చర్చ పెడదామా.. అని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాల్సిందేనని, లేకుంటే ప్రజలే ఈ ప్రభుత్వ భరతం పడతారని తెలిపారు. సింగరేణి బొగ్గు గనుల ప్రయివేటీకరణ సహించేది లేదన్నారు. సింగరేణిలో కార్మికుల సంక్షేమం, హక్కులు గాలికి వదిలేశారని ఆరోపించారు. భద్రాచలం పరిసర ప్రాంతాల్లో ఐటీసీ కర్మాగారం వల్ల కాలుష్యం పెరిగి ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, ఉమ్మడి జిల్లాకు ముగ్గురు మంత్రులు ఉన్నారని, ప్రజల సమస్యలపై స్పందించి పరిష్కరించే చర్యలు చేపట్టాలన్నారు. భద్రాచలం ఈఓ రమాదేవిపై జరిగిన దాడిని ఖండించారు. రాముల వారి 1000 ఎకరాల భూములు ఆంధ్రాలో కలిశాయని, వాటిని పరిరక్షించాలన్నారు. భద్రాచలంలోని ఆ ఐదు గ్రామాలను తెలంగాణలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై ప్రధాని మోడీ, ఎపి సిఎం చంద్రబాబు నాయుడుకి లేఖలు రాస్తున్నట్టు తెలిపారు. రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవం, అస్థిత్వం కోసం కాంగ్రెస్ పాలనలో మళ్లీ ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఏర్పడిందని, అందుకే జాగృతిని బలోపేతం చేస్తున్నట్టు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జాగృతి రాష్ట్ర మహిళా అధ్యక్షులు మాధవి, జిల్లా అధ్యక్షులు పవన్, గోపు సదానందం, ఎండీ హుస్సేన్, నవతన్, టిబిజికెఎస్ నాయకులు కాపు కృష్ణ, సింధు తపస్విని తదితరులు పాల్గొన్నారు.